నేటి నుంచి ఇంటింటి సర్వే

- వెస్ట్ జోనల్ పరిధిలో 3,75,911 గృహాలు
- 3,164 మంది ఎన్యూమరేటర్లు, 317 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి
- ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 ఇళ్లు
- సర్వేకు ప్రజలు సహకరించాలి: జెడ్సీ ఉపేందర్‌రెడ్డి



శిక్షణా కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు

గచ్చిబౌలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యూమరేటర్లు నేటి నుంచి ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయనున్నారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యతో ఇలా పలు వివరాలు సేకరించనున్నారు. 2011లో చేపట్టిన జనాభా లెక్కలు, ఆస్తి పన్ను ఆధారంగా శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో మొత్తం 3,75,911 ఇళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అత్యధికంగా శేరిలింగంపల్లి సర్కిల్‌లో 1,28,700 ఇళ్లు ఉండగా చందానగర్ సర్కిల్‌లో 1,12,350, యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 84,293, పటాన్‌చెరు సర్కిల్‌లో 50,568 ఇళ్లు ఉన్నాయి.

పలు అంశాల సేకరణ

ఇంటింటి సర్వేలో దాదాపుగా వందకు పైగా అంశాలలో వివరాలు సేకరించాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వయస్సు, మాతృభాష, ఆధార్ నెంబర్, ఓటర్ ఐడీ, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఉపాధి, అక్షరాస్యత, వృత్తుల వివరాలు, రాజకీయ నేపథ్యం ,చదివిన పాఠశాల రకం, విద్యార్హతలు, భూముల యాజమాన్యం, ఆరోగ్య సదుపాయాలు తదితర వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. నాలుగు లక్షల ఫారాలను సిద్ధం చేయగా తెలుగులో 3,47,800, ఇంగ్లిష్‌లో 52,200 ఫారమ్స్ సిద్ధం చేశారు.

సిబ్బందికి శిక్షణ పూర్తి

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లో ఇంటింటి సర్వే చేపట్టేందుకు అదనంగా 20 శాతం కలిపి 3,164 మంది, 317 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో 1,030, చందానగర్ సర్కిల్ 899, యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 828, పటాన్‌చెరు సర్కిల్‌లో 407 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. నాలుగు సర్కిళ్లలో విధుల్లో 2,439 మంది ఎన్యూమరేటర్లు, 282 మంది సూపర్‌వైజర్లు విధుల్లో పాల్గొంటారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు సుమారు 150 ఇళ్లు కేటాయిస్తారు. నవంబర్ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఇళ్లను జాబితాలో చేరుస్తారు. నవంబర్ 9 నుంచి 15 రోజుల పాటు సర్వే చేయాల్సి ఉంటుంది. వాస్తవ పరిస్థితిని బట్టి సర్వే కాలంలో మార్పులు ఉండే అవకాశం ఉంటుంది.

సర్వేకు సహకరించాలి

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి సర్వేలో భాగంగా వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రతి ఒక్కరు సహకరించాలి. కుటుంబ సభ్యులు, ఇతర వివరాలు ఒక చోట నమోదు చేస్తే మరో ప్రాపర్టీ వద్ద ఇవ్వాల్సిన అవసరం లేదు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు సహకరించాలి.

– జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

నిర్దేశిత గడువులోపు సర్వే పూర్తి చేయాలి

డీసీ మోహన్‌రెడ్డి



సర్వే మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీసీ మోహన్‌రెడ్డి తదితరులు

చందానగర్: సమగ్ర సర్వేను చందానగర్ సర్కిల్ 21 పరిధిలో నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని డీసీ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం చందానగరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు నియామక పత్రాలు, సర్వే మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజులలో సర్వేను పూర్తి చేయాలన్నారు. మొదటి విడతలో వారికి కేటాయించిన కుటుంబాలను గుర్తించి ఇంటి నెంబరు తదితర వివరాలను నమోదు చేసుకొని ఇంటికి స్టిక్కర్ అతికించాలన్నారు. రెండవ విడతలో కుటుంబ సభ్యుల అందరి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వివరాలు జాగ్రత్తగా మార్గదర్శక పుస్తకంలో సూచించిన ప్రకారం పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీలు కృష్ణ, విజయ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, డీఈలు స్రవంతి, దుర్గా ప్రసాద్, ఏఈలు ప్రతాప్, ప్రశాంత్, సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు,

రూ.28 కోట్లతో చెరువుల అభివృద్ధి

- పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, ముత్తంగి గ్రామ పరిధిలోని ఎన్నం చెరువులను రూ.28.36 కోట్లతో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు.మంగళవారం జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ చెరువుల విభాగం ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి తిమ్మక్క చెరువు, సాకి చెరువు, ఎన్నం చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రధాన చెరువులైన తిమ్మక్క చెరువును ఏపీఆర్ గ్రూప్ సౌజన్యంతో 3.46 కోట్ల రూపాయలతో, సాకి చెరువును ఇంకార్ గ్రూప్ సౌజన్యంతో 8 కోట్ల తో, ముత్తంగి ఎన్నం చెరువును హెచ్ఎండీఏ ద్వారా 6 కోట్ల 90 లక్షల రూపాయలతో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. అలాగే సాకి చెరువు కట్టపైన జీహెచ్ఎంసీ చెరువుల విభాగం ద్వారా 10 కోట్ల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ప్రతి చెరువుకట్ట పైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్ఎండీఏ చెరువుల విభాగం డీఈ రామారావు, జీహెచ్ఎంసీ చెరువుల విభాగం డీఈ నళిని, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్ పాల్గొన్నారు.

అధ్వానంగా లింగంపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు



లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద దెబ్బతిన్న రోడ్డు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. ముఖ్యంగా స్టేషన్‌లోని 6వ ప్లాట్‌ఫారం, దూబే కాలనీ గేటు వద్ద రోడ్డు దెబ్బతింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను తీసుకు వెళ్లేందుకు వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు దెబ్బతినడంతో వాహనాలు నెమ్మదిగా సాగుతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రైల్వే ఉన్నతాధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కేపీహెచ్‌బీకాలనీ: పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్ శిల్పా ఎవెన్యూ కాలనీలో ఆగిపోయిన వివిధ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా సీవరేజ్ పైపు లైన్, రోడ్లు, వీధి లైట్లు తదితర పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏఈ సాయిప్రసాద్, హెచ్ఎండబ్ల్యూస్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, పుల్లారావు, ప్రభాకర్, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్ గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జిమ్స్ హోమియోపతి వైద్య కాలేజీ- ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రీ డయాబెటిక్, డయాబెటిక్ వ్యాధిగ్రస్తులకు వైద్య సలహాలు అందజేశారు. డయాబెటీస్‌పై అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఫనీష్, డాక్టర్ ఆకాశం దీప్‌దాస్, డాక్టర్ హరిష్మా పాల్గొన్నారు.





పచ్చగా.. ఆకర్షణీయంగా..

డివైడర్‌ల మధ్యన పూల మొక్కలు ఏర్పాటు చేశారు. మాదాపూర్‌లోని మినీ చార్మినార్ నుంచి న్యాక్ గేట్ వరకు, అయ్యప్పసొసైటీ ఎక్స్‌రోడ్ నుంచి కావూరి హిల్స్ వరకు, అండర్‌పాస్ వద్ద జీహెచ్‌ఎంసీ సిబ్బంది పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. పచ్చదనం ఉట్టిపడుతుండడంతో చూపరులను ఆకర్షిస్తున్నాయి - మాదాపూర్

నీటి సరఫరాలో అంతరాయం

మణికొండ: సింగూరు ప్రాజెక్టు వద్ద పైప్‌లైన్ పగిలిపోవటంతో నీటి సరఫరాను నిలిపివేశామని, మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని మణికొండ జీఎం మహేందర్‌నాయక్ తెలిపారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు నీటి సరఫరా ఆగిపోయిందన్నారు. బుధవారం సాయంత్రం నుంచి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని, అప్పటి వరకు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ఆయన కోరారు.

పోషకాహారం తీసుకోవాలి

పటాన్‌చెరు టౌన్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే రక్తహీనత రాదని మంజీరా జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మంజీరా కళాశాలలో మంగళవారం జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు భారత్ వికాస్ పరిషత్ ద్వారా హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు, డాక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్‌కు చెందిన నీలిమకు చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ 5 లక్షల రూపాయల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు.

బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీలో మంగళవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలోని పార్కులో పిచ్చి మొక్కలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కార్పొరేటర్ పుష్పనగేష్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలో కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

వసతులు కల్పించాలంటూ నిరసన

ఆల్విన్‌కాలనీ: హనుమాన్‌నగర్ బస్తీ దవాఖానాలో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దవాఖానా ఎదుట సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం కూకట్‌పల్లి కార్యదర్శి ధర్మారావు మాట్లాడుతూ..రోజూ రక్త పరీక్షలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల క్రితం బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశారని, స్థానిక ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తే మందులు అందుబాటులో లేవని వైద్యులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్త పరీక్షలు కూడా చేయడం లేదన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు కృష్ణారావు, బాలరాజ్, పోలయ్య పాల్గొన్నారు.

సన్మానం

నిజాంపేట్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన కాసాని వీరేష్‌ముదిరాజ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. వనపర్తి జిల్లా కబడ్డీ జట్టు అధ్యక్షురాలు పద్మజారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టీమ్ సభ్యులు బాచుపల్లిలోని కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గుంతలమయంగా పుప్పాలగూడ రోడ్లు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో రోడ్లు గుంతలుపడ్డాయని, డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ పుప్పాలగూడలో తాగునీటి సమస్య, విద్యుత్ సరఫరా అంతరాయాలు, పుప్పాలగూడ వార్డు కార్యాలయ నిర్మాణం పెండింగ్‌లో ఉందన్నారు. గతంలో రూ.45 లక్షలు కేటాయించినా భవనం నిర్మించక పోవటం దారుణమన్నారు. పుప్పాలగూడలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా ఎపుడూ మూసే ఉంటుందని ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు ఎం.లక్ష్మయ్య, ఎ.లక్ష్మణ్‌రావు, బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంతోష్, రమేష్, అశోక్, కిరణ్, షేక్ ఆరీఫ్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మూసాపేట: అగ్ని ప్రమాదం సంభవించినపుడు కంగారు పడకుండా మంటలను అదుపు చేసి ప్రమాదాన్ని తగ్గించాలని కూకట్‌పల్లి అగ్నిమాపక అధికారి జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. మాల్స్, సినిమా థియేటర్లలో, సూపర్ మార్కెట్‌లలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలా తప్పించుకోవాలి. ప్రమాదాన్ని ఎలా తగ్గించాలో డ్రిల్ చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి షాపు, మాల్స్, సూపర్ మార్కెట్‌లలో మంటలను ఆర్పేందుకు వినియోగించే సిలిండర్‌లు ఉంటాయని, వాటిని ఉపయోగించి మంటలను ఎలా అదుపు చేస్తారో చేసి చూపించారు.

గంజాయి విక్రేత అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు కూకట్‌పల్లి పోలీసులు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నంకు చెందిన గూడెపు రాజు (51) భార్య మూడు సంవత్సరాల క్రితం చనిపోయింది. పిల్లలు ఉన్నప్పటికీ ఒంటరిగా ఉంటున్నాడు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న బస్టాప్‌లో గంజాయి రవాణా చేస్తున్నాడని సమాచారం అందడంతో.. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. అతని వద్ద ఉన్న 2.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. కాగా ఇతని మీద గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, 8 నెలలు జైల్లో ఉండి మూడు నెలల క్రితమే విడుదల అయ్యాడని పోలీసులు తెలిపారు. విశాఖపట్నం నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరంలో విక్రయించి వెళుతుంటాడని తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

బంజారాహిల్స్: హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. వెస్ట్‌జోన్ పరిధిలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ తీసుకువచ్చిన తర్వాతనే వాహనాలను ఇచ్చారు. మొదటి రోజు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హెల్మెట్ లేకుండా రోడ్డెక్కిన 711 మందిని పట్టుకున్నారు. అత్యధికంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 302 మంది, జూబ్లీహిల్స్ పరిధిలో 199 మంది, పంజగుట్ట పరిధిలో 111 మంది, ఎస్సార్‌నగర్ పరిధిలో 99 మంది పట్టుబడ్డారు. వీరందరికీ మొదటి రోజు కౌన్సెలింగ్ ఇచ్చి హెల్మెట్ తీసుకువచ్చిన తర్వాతనే బైక్‌లు ఇచ్చామని, రెండో రోజు నుంచి జరిమానాలు విధించడం జరుగుతుందని ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా తెలిపారు. ఇదిలా ఉండగా హెల్మెట్లు ధరించి స్ఫూర్తిని చాటుతున్న వాహనదారులకు గులాబీపూలు ఇచ్చి అభినందనలు తెలిపారు. కొన్ని బైక్‌లపై వెనుకాల కూర్చొన్న వారు కూడా హెల్మెట్ ధరించగా వారిని ప్రత్యేకంగా అభినందించారు.



గులాబీ పూలు ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వైట్‌ఫీల్డ్ ఏఈ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మారుతీనగర్, గాయత్రి లే అవుట్, సెంట్రల్‌పార్క్ ఫేజ్-2, ఫేజ్-3, కాంతివనం, శిల్పావ్యాలీ, స్ప్రింగ్ వ్యాలీ, మాధవహిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: హఫీజ్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు. ఇంద్రారెడ్డినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అంబేడ్కర్‌నగర్, హఫీజ్‌పేట్ యూత్ కాలనీ, మదీనాగూడ, మైత్రీనగర్, మార్తాండనగర్ న్యూ, మాతృశ్రీనగర్, మాతృశ్రీనగర్ ఎస్‌బీఐ ఏరియా, న్యూ హఫీజ్‌పేట్, ప్రకాష్‌నగర్, సమతా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, బీహెచ్ఈఎల్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 45, బెండ 70, కాకర 60, దొండ 40, దోస 60, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 60, గోకర 60, బీన్స్ 100, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 90, క్యాబేజీ 40, క్యారెట్ 80, చిక్కుడు 100, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 300.

7 నుంచి మనూలో 'ఆజాద్ డే'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆజాద్ డే -2024 నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మనూ మోడల్ స్కూల్‌లో నవంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. వేడుకల్లో భాగంగా ఫిల్మ్ స్క్రీనింగ్, బుక్ రిలీజ్, స్టోరీ టెల్లింగ్, ఐటీ ఎక్స్‌పో, డిబేట్, బుక్ అండ్ ఫొటో ఎగ్జిబిషన్, ప్యానెల్ డిస్కషన్, ఓపెన్ మైక్ కాలిగ్రఫీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్‌ఫెస్ట్, ముషాయిరా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

11న ఆజాద్ డే మెమోరియల్ లెక్చర్

ఆజాద్ డే వేడుకల్లో భాగంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాద్ డే మెమోరియల్ లెక్చర్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కృష్ణకుమార్ ఉపన్యాసం ఇస్తారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



రఘునాథయాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

గచ్చిబౌలి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథయాదవ్ సూచించారు. దివ్యాంగుల పట్టణ సమాఖ్య సంఘం నాయకులు మంగళవారం రఘునాథయాదవ్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు విజయకుమార్, వెంకటేష్, సాగర్, ఫకీర్, లక్ష్మీ, రాజేశ్వరి, ఊర్మిళ, సాయిబాబా ఉన్నారు.

రెండు బైక్‌లు చోరీ

గచ్చిబౌలి: తలకు హెల్మెట్, ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు రెండు బైక్‌లను చోరీ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సుదర్శన్‌నగర్‌లో హెల్మెట్ పెట్టుకొని ఒకరు, తలకు ముసుగు ధరించి మరొకరు నడుచుకుంటూ వచ్చి ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న బెల్లుట్, యమహా బైక్‌ల హ్యాండిల్ లాక్ బ్రేక్ చేసి బండ్లతో ఉడాయించారు. చోరీ చేసిన వీడియోలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కానీ నిందితుల ముఖం కనిపించకపోవడంతో ఎవరనేది గుర్తించలేక పోయారు. బాధితులు ఉదయ్ సాయిరెడ్డి, రమాకాంత్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఐ రాజేష్ తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సుదర్శన్‌నగర్ కాలనీ, ప్రధాన రహదారితో పాటు సమీప ప్రాంతాలలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్.. జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన, ఒకరికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఫోన్ హ్యాక్ చేసి నగదు డ్రా..

- రూ.45 వేలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని
- మొత్తాన్ని హోల్డ్ చేసిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఫోన్‌ను హ్యాక్ చేసి నగదు డ్రా చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఫోన్‌ను అపరిచిత వ్యక్తులు అక్టోబర్ 31 తేదీన హ్యాక్ చేశారు.అనంతరం ఆ ఉద్యోగిని ఫోన్ నుండి 45 వేల నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు వెంటనే తన ఫోన్ చెక్ చేయగా పిల్లలు ఓ గేమింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినట్లు గుర్తించి వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రూ.45 వేల నగదును హోల్డ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వీల్‌ఛైర్ అందజేత

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డి నగర్ బస్తీ దవాఖానాను మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ఎస్. రెడ్డి భూపాల్‌రెడ్డి వీల్ ఛైర్‌ను ఆసుపత్రికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా బస్తీ దవాఖానాలో వైద్యుడు లేరని త్వరగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో పర్వతాలు యాదవ్, మహిళా మోర్చా నాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.